క్లుప్తంగా

స్వదేశ్ భూషణ్ అవార్డ్‌కు ప్రదీప్ ఎంపిక



అవార్డ్‌కు ఎంపికైన ప్రదీప్

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ పి.ప్రదీప్ స్వదేశ్ భూషణ్–2025కు ఎంపికైనట్లు స్వదేశ్ సన్‌స్థన్ ఇండియా ప్రకటించింది. ఈ మేరకు ఆయన ఉత్తర్‌ప్రదేశ్‌లోని సాగర కళాభవన్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. అవార్డు అందుకున్న ఆయనకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్ నాయుడు, లెక్చరర్లు, విద్యార్థులు అభినందించారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



పుల్లలచెరువు: రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో నిర్మలాదేవి

పుల్లలచెరువు: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ప్రతి రైతు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి కోరారు. బుధవారం మండల కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు తన ఆధార్‌కార్డు, పాసుపుస్తకం తీసుకుని సమీపంలోని ఆర్బీకే వద్దకు వెళ్లి వీఏఏతో కలిసి చేయించుకోవాలన్నారు. మండల కేంద్రంలో త్వరలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని, దీనిలో క్వింటా మద్దతు ధర రూ.7,550 ఉన్నట్లు చెప్పారు. కందులు వేసిన రైతులు సమీపంలోని వీఏఏ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ రాధకృష్ణ, వీఏఏలు బ్రహ్మయ్య, కొండానాయక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నాగులమీరాస్వామి ఉరుసు

పెద్దారవీడు: మండలంలోని మద్దలకట్ట శ్రీ నాగులమీరాస్వామి ఉరుసు మహోత్సవాలు శుక్ర, శనివారాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. శుక్రవారం గంధం పూజ, రాత్రి 9 గంటలకు భక్త చింతామని పూర్తి నాటకం, శనివారం ఉదయం 6 గంటలకు జెండాల ఊరేగింపు, సాయంత్రం భారత కోలాటం బృందంచే కోలాటం ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.



మధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శనమిస్తున్న శ్రీశైలం రహదారి



ఎండల దృష్ట్యా మార్కెట్‌లోకి వచ్చిన పుచ్చకాయలు

ఎండలు బాబోయ్.. ఎండలు!

- ఇప్పుడిప్పుడే మండిపోతున్న సూర్యుడు
- రోడ్లపై తగ్గుముఖం పట్టిన జన సంచారం
- రాత్రి చలి, పగలు ఎండతో విభిన్న వాతావరణం

పెద్దదోర్నాల: ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే ఎండలు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రెండు రోజులుగా మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్‌కుపైగా నమోదవుతోంది. ఆరంభంలోనే ఎండలు దంచి కొడుతుండటంతో ముస్ముందు మరెంత తీవ్రంగా ఉంటాయోనన్న ఆందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మండలంలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. మండల పరిధిలో రాత్రి వేళ ఉష్ణోగ్రతల్లో కొంతమేర మార్పు కనిపిస్తోంది. అర్ధరాత్రి నుంచి చలి తీవ్రతలు, పగటి వేళల్లో ఎండ వేడిమితో విభిన్న వాతావరణం నమోదవుతున్నాయి. సాధారణంగా ఏటా ఫిబ్రవరిలో నమోదయ్యే ఉష్ణోగ్రతల్లో కంటే ఈ ఏటా ఉష్ణోగ్రతలు 2, 3 డిగ్రీలు అదనంగా నమోదవుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోడ్లపై తగ్గుముఖం పడుతున్న జన సంచారం

ఎండల కారణంగా మధ్యాహ్న సమయంలో రోడ్లపై జన సంచారం తగ్గుతుంది. అత్యవసరమైతే తప్ప బయటకు వచ్చేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండల తీవ్రత తగ్గడం లేదు. మరో కొన్ని రోజుల వరకు కూడా ఎండ తీవ్రత ఇలాగే కొనసాగుతాయని వాతావరణ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎల్లప్పుడు శ్రీశైలం వెళ్లే యాత్రికులతో రద్దీగా ఉండే శ్రీశైలం రహదారులు కూడా రద్దీ లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

మార్కెట్‌ను ముంచెత్తుతున్న పుచ్చకాయలు

ఎండల తీవ్రత ఎక్కువ అవుతుండటంతో చల్లదనాన్ని అందించే పుచ్చకాయలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వేసవి తాపాన్ని తీర్చడంలో ఇవి ఎంతో దోహదపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేసిన పుచ్చకాయలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పలు వాహనాల్లో మార్కెట్‌లోకి వస్తున్నాయి. దీంతో పాటు ప్రజలకు సేదతీర్చే నన్నారి షరబత్, మజ్జిగ, లస్సీ, ఫ్రూట్ జ్యూస్ పాయింట్లకు క్రమంగా గిరాకీలు పెరుగుతున్నాయి. ఉక్కపోతలు ఆరంభం కావడంతో ప్రజలు కూలర్లు తదితర వాటిని అప్పుడే సిద్ధం చేసుకునేందుకు ఉపక్రమిస్తున్నారు.

వలస కూలీలు



వెంకటరెడ్డిపల్లి చివర కూలీలు వేసుకున్న గుడిసెలు

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి పంటను అధికంగా సాగు చేశారు. ఈ ఏడాది సాగు ఎక్కువ కావడంతో కూలీలు స్థానికంగా అందుబాటులో లేరు. కర్నూలు జిల్లా ఆవుకు, ఎమ్మిగనూరు మండలాల నుంచి స్థానికంగా పలు గ్రామాలకు పనులు చేసేందుకు కూలీలు వచ్చారు. వచ్చిన కూలీలను ప్రశ్నించగా తమ జిల్లాలో సరిపడా పనులు లేవని, బదుకుదెరువు కోసం పిల్లా పాపలతో రాక తప్పలేదని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి మిర్చి కోతలు పూర్తయ్యే వరకు వీరు ఇక్కడే ఉండి పనులు చేసి సొంత జిల్లాకు వెళ్తారు. వీరంతా గ్రామంలో చివర లేదా పొలాల వద్ద తాత్కాలిక గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వీరికి రైతులు రోజుకు రూ.400 కూలి ఇస్తారు.



మిర్చి కోస్తున్న కూలీలు

వధువుకు వెంకాయమ్మ ఆశీర్వాదం

కురిచేడు: మండలంలోని గంగదొనకొండ గ్రామానికి చెందిన గోదాల సుబ్బారెడ్డి కుమార్తెను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం ఆశీర్వదించారు. సుబ్బారెడ్డి కుమార్తె శ్రీలేఖ వివాహం సందర్భంగా ఆమెను ఆశీర్వదించారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ వెంట జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనరు వైవీ సుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోగులముడి లింగారెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, ఇంటలెక్చువల్ విభాగం కన్వీనర్ వీరగంథం కోటయ్య, వైస్ ఎంపీపీ అన్నెం అరుణ, ఎంపీటీసీ సభ్యుడు కానాల శివారెడ్డి, పడమరగంగవరం సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కండె గంగయ్య, కాకర్ల కృష్ణారెడ్డి ఉన్నారు.



శ్రీలేఖను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

కాలియోగ్రఫీ పోటీల్లో విద్యార్థికి ప్రథమ బహుమతి



విద్యార్థికి గుర్తింపు పత్రం అందజేస్తున్న డీఈవో శామ్యూల్ జాన్

త్రిపురాంతకం: రాష్ట్ర స్థాయి కాలియోగ్రఫీ పోటీల్లో మండలంలోని కంకణాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి నంబుల రాజకుమార్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు బుధవారం మార్కాపురం డిప్యూటీ విద్యాశాఖాధికారి బీరెల్ల శామ్యూల్ జాన్ అభినందించి గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈ నెల 8వ తేదీన గుంటూరు హిందూ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కాలియోగ్రఫీ పోటీలు జరిగాయి. పోటీలో పాల్గొన్న రాజకుమార్ తన ప్రతిభ చాటాడు. కాలియోగ్రఫీలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి పొంది పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిన ఆ విద్యార్థితో పాటు కాలియోగ్రఫీ నేర్పించిన ఉపాధ్యాయుడు కె.అచ్చిరెడ్డిని ఎంఈవోలు కె.తులసి మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి, హెచ్ఎం జి.వెంకాయమ్మ అభినందించారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కళ్యాణం

దర్శి: స్థానిక బంగారమ్మ బావి వద్ద వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి కళ్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామి, అమ్మవార్ల కళ్యాణం జరిగింది. కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ చేశారు.



కళ్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం

తాళ్లూరు: స్థానిక వీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల 48వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు పాటలు, డ్యాన్స్‌లతో తమ ప్రతిభ చాటారు. కళాశాలలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు లక్ష్మయ్య, గురవయ్య, లలిత, బోస్, పార్వతిబాయ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రావు

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

దర్శి: స్థానిక అద్దంకి రోడ్డులో కనకదుర్గమ్మ గుడి వద్ద సైకిలుపై వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడి చికిత్స పొందుతున్న బొగ్గరపు రంగనాయకులు (81) బుధవారం మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. రంగనాయకులు తలకు గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.



రంగనాయికులు మృతదేహం

39 బస్తాల రేషన్ బియ్యం సీజ్

దర్శి: నల్లబజారుకు ఆటోలో తరలుతున్న పేదల బియ్యాన్ని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి పట్టుకుని సీజ్ చేశారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు మండలంలోని శివరాజనగర్ వద్ద అధికారులు మాటువేసి ఆటోను సీజ్ చేశారు. ఆటోలో తరలుతున్న 39 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కందిసాగు విస్తీర్ణం పెంచాలి



రైతులకు కంది పంట గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రమేష్



వై.పాలెం: మిర్చి పంటను పరిశీలిస్తున్న ఏవో శేషారెడ్డి

దర్శి: కందిసాగు విస్తీర్ణం పెంచాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ పేర్కొన్నారు. కంది క్షేత్ర దినోత్సవం మండలంలోని తూర్పువెంకటాపురంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శి సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో మేలైన ఎండు తెగులు, వైరస్ తెగులు తట్టుకునే కంది రకాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. కందిలో ఎల్ఆర్‌జీ 105 రకం ఎండు తెగులు, వైరస్ తెగులును సమర్థంగా తట్టుకొని అధిక దిగుబడులు ఇస్తుందన్నారు. అనంతరం రైతులతో కలిసి కంది పంటను సందర్శించారు. కంది పంట గుణగణాలను రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి బాలాజీనాయక్, తూర్పు వెంకటాపురం వీఏఏ సుధాకర్ పాల్గొన్నారు.

దొనకొండ: ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పని సరని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం ఆరవల్లిపాడులో పర్యటించారు. రైతు గుర్తింపు కార్డు నమోదుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, 1బీ, మొబైల్ నంబర్ తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. దీంతో రైతులకు పంట బీమా, పంటలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై డ్రిప్‌లు, పంట రుణాలు, పంట పథకాలతో లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు. అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాలు పరిశీలించారు.

ముండ్లమూరు (దర్శి): రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 15వ తేదీలోపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కోరారు. బుధవారం ఆయన మండలంలోని జమ్మలమడక, మారెళ్ల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. భూమి కలిగిన ప్రతి రైతూ విశిష్ట రైతు గుర్తింపు సంఖ్య నమోదు కోసం సంబంధిత రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నమోదు ప్రక్రియ కోసం రైతు ఆధార్ నంబర్, పొలం పాసుపుస్తకం, ఆధార్ అనుసంధానిత ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రానికి వెళ్లి సిబ్బందిని సంప్రదించాలన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: కంది పంట సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని, కందులు అమ్మకాలు జరిపే సమయంలో గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తమ్మడపల్లి, గుర్రపుశాల గ్రామాల్లో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. తొలుత ఆయా గ్రామాల రైతులు పండిస్తున్న కంది, మిర్చి పంటలను ఆయన పరిశీలించారు. పట్టాదారు పాస్ బుక్ ఉన్న ప్రతి రైతు భూ అధారిత గుర్తింపు కార్డు పొందేందుకు అర్హులని, తమ గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్లో 11 అంకెలుగల రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని, భూ అధారిత గుర్తింపు కార్డు ఉన్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని, గుర్తింపు కార్డు పొందే రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఉన్న సెల్ నంబర్‌ను రైతు సేవా కేంద్రాల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రిరెడ్డి, ఏఈవోలు సూరజ్ బాషా, మణికుమార్ పాల్గొన్నారు.



ముండ్లమూరు: పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి



దొనకొండ: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో